# అడల్ట్స్ ఓన్లీ కథ



# శుభవార్త

## చిట్టిపెద్ది ఉమ

''మాధవిగారూ! ఏ లోకంలో ఉన్నారు... అంత ఘాటు ప్రేమలేఖ ఎవరు రాశారో?'' రాజశేఖర్ మాధవిని ఆటపట్టిస్తూ అన్నాడు.

''ప్రేమలేఖ కాదు.. పిన్నిలేఖ..''

''ఏంటీ విశేషాలు..'' రాజు డైనింగ్ టేబుల్ మీద ఉన్న ఫ్లాస్క్‌లోంచి కాఫీ కప్పులోకి వంచుకుంటూ అడిగాడు.

''ప్రియ.. అదే మా పిన్నికూతురు.. పెళ్ళిలో చూశారుగా.. దానికి మీలాంటి మంచి అబ్బాయి ఎవరైనా ఉంటే చూడమని రాసింది.''

''మళ్ళీ నాలాంటి అబ్బాయిని వెతకడం ఎందుకు..నేనే చేసేసుకుంటాను'' రాజు కొంటెగా అన్నా మాధవి మనసు ఒక్క క్షణం చివుక్కుమంది.

''మీకన్నీ వేళాకోళాలే.. సీరియస్‌గానే చెప్తున్నా.. ఎవరైనా ఉంటే కాస్త దృష్టిలో పెట్టుకోండి. మా పిన్ని పాపం ఎంతో కష్టపడుతోంది. ప్రియ చాలా అందంగా ఉంటుంది. మీరు చూశారుగా...ఎవరైనా కట్నానికి కక్కుర్తి పడకుండా ముందుకి వస్తే మా పిన్ని గట్టెక్కుతుంది. ప్రియ చెల్లెలు రాణిని వాళ్ళకి తెల్సిన వాళ్ళు అడిగి చేసుకుంటున్నారు. దీనికీ కుదిరితే ఇద్దరికీ కలిపి ఒకటేసారి పెళ్ళి చెయ్యాలని మా పిన్ని అనుకుంటోంది. దీని పెళ్ళికోసం దాని పెళ్ళి వాయిదాపడింది. ఎంతయినా అక్కకి చెయ్యకుండా చెల్లెలుకి చెయ్యలేరుగా. ప్రియకి ఓ కుంటి బావ ఉన్నాడు. వాడూ, వాళ్ళమ్మా ప్రియమీద కన్నేశారు. త్వరలో ఏ సంబంధం కుదరకపోతే ప్రియ వాళ్ళ పాల పడాల్సిందే.''

''పిల్ల ఎంత బావున్నా కట్నం లేకుండా రావాలంటే కష్టమే. అందరూ నాలాగ వెర్రివెంగళప్పల్లా ఉండరుగా'' ఖంగుతిన్నట్టు కళ్ళు వెడల్పు చేసుకుని చూసింది మాధవి రాజువైపు. ఏమైంది రాజుకి.. రెండోసారి ఇలా వంకరగా మాట్లాడడం ఇవ్వాళ.


''రాజుగారికి ఇవ్వాళ మూడ్ బావున్నట్టు లేదు'' మాధవి నవ్వుతూ అంది.

''మరి ఇంటికి రాగానే ఉత్తరం పట్టుకుని మూడీగా కూర్చుని మామూలు ఇవ్వకపోతే...'' రాజశేఖర్ బుంగమూతి చూసి మాధవి మనసు తేలికపడింది.

''ఏమండీ..మన ఆఫీస్‌లో వినోద్ పెళ్ళికొడుకే...సుజాత వాళ్ళ తమ్ముడు కూడా అమ్మాయిల్ని చూడడం కోసం ఢిల్లీనుంచి వస్తున్నాడుట. ప్రియని కొన్నాళ్ళు మనతో ఉండడానికి రమ్మంటే వాళ్ళకి చూపించవచ్చు.''

''పెళ్ళిళ్ళ పేరమ్మవి అవుతావన్నమాట'' రాజు వెక్కిరింతగా అన్నాడు.

మాధవి పిన్ని రాజేశ్వరి, అమ్మ సుందరమ్మా ఇద్దరూ అన్నదమ్ముల పిల్లలు. ఇద్దరూ వితంతువులే...నడివయసులోనే భర్తల్ని పోగొట్టుకున్న అక్కచెల్లెళ్ళిద్దరూ దగ్గరి ఊళ్ళల్లో ఉండడంతో మరీ దగ్గరయ్యారు. అందుకే మాధవికి ప్రియ, రాణి సొంత చెల్లెళ్ళలాగే... మాధవికంటే ప్రియ రెండేళ్ళు చిన్నది. అందుకే ప్రియకి సంబంధం చూడమని రాసిన పిన్ని ఉత్తరం అందుకున్నప్పటి నుంచీ ప్రియకెలాగైనా మంచి వరుడిని చూసి దాన్ని దాని బావ పాలపడకుండా చెయ్యాలనిపిస్తోంది. ఇంటర్ దాటలేక చదువు ముగించి ఇంట్లో కూర్చుంది ప్రియ. అందంగా ఉన్నా



అటు కట్నం ఇవ్వలేదు. ఇటు ఉద్యోగం లేదు. అందుకే ప్రియకి సంబంధం కుదరడం కష్టంగా ఉంది.

''నేను పేరమ్మనైతే మీరు పేరయ్య. దాని పెళ్ళికి మనమే పెద్దలం''


''అప్పుడే పెద్దవాళ్ళం అయిపోయామా?''

''మరి..''

''పిల్లలు పుట్టేవరకూ మనం పిల్లలమే'' రాజు మాటలకి అందంగా సిగ్గుపడింది మాధవి.

మాధవి, రాజశేఖర్ ఇద్దరూ ఓ ప్రయివేట్ సంస్థలో ఉద్యోగస్తులు..అక్కడే ఒకరికొకరు పరిచయం..(ప్రేమ... ఆ తర్వాత పెళ్ళి).. పెళ్ళయి రెండేళ్ళయినా వాళ్ళకింకా పిల్లలు లేరు. ఆర్థికంగా కాస్త నిలదొక్కుకునే వరకూ అంటే ఇంకో ఏడాది దాకా పిల్లల ఊసు ఎత్తద్దనుకున్నారు.

ఆరోజు రాత్రే ప్రియని కొన్నాళ్ళు హైదరాబాద్ పంపమని రాసేసింది మాధవి. కట్నం లేకుండా ప్రియ అందం చూసి ఎవరైనా ముందుకు వస్తే తప్ప ప్రియ పెళ్ళి చేయడం రాజేశ్వరి వల్ల కాదు. మాధవి ఆ రాత్రంతా తనకి తెల్సినవాళ్ళు, ప్రియకి ఈడైనవాళ్ళు 'ఎవరున్నారా' అని ఆలోచిస్తూనే ఉంది.



★ ★ ★

''ప్రియా టవల్ పట్రా'' రాజు బాత్రూమ్‌లోంచి అరిచాడు.

వంటింట్లో వంట చేస్తున్న మాధవి గబుక్కున గ్యాస్ ఆర్పి బయటికి వచ్చింది. టవల్ తీసుకుని బాత్రూమ్ వైపు వెళ్తున్న ప్రియ చేతిలోంచి టవల్ తీసుకుంది.

''ఏంటండీ.. ప్రియని పిలవడం.. నన్నడిగితే నేనిస్తానుగా'' చిన్నగా మందలింపుగా అంది మాధవి. ప్రియని రమ్మంటానని మాధవి అన్నప్పుడు రాజు చాలా అయిష్టంగానే ఒప్పుకున్నాడు. కానీ ప్రియ వచ్చాక ఈ నెల రోజుల్లోనూ రాజు ప్రియతో ఆప్యాయంగా అరమరికలు లేకుండా ఉండడం మొదట్లో మాధవికి చాలా రిలీఫ్‌గా అన్పించినా రాను రానూ రాజు ధోరణి శృతిమించుతోంది అన్పిస్తోంది. ప్రియ కూడా వచ్చిన కొత్తల్లోలా బెరుగ్గా, బిడియంగా ఉండకుండా అతి చనువు ప్రదర్శిస్తోంది. ఎంత సర్దుకుందామనుకున్నా మాధవి మనసు అప్పుడప్పుడు చివుక్కుమంటోంది. వాళ్ళిద్దరి ప్రవర్తనా చూసి.. అందులో ఆ పేరు ఒకటి ప్రియా.. ప్రియా అంటూ రాజు ఆ పేరుని రకరకాలుగా ధ్వనించేట్టు మత్తుగా పలకడం... ప్రియ కిలకిలలాడడం ఎందుకో మాధవికి ఎబ్బెట్టుగా ఉంటోంది. ప్రియని అనవసరంగా పిలిపించానా అని కూడా అనిపిస్తోంది.

''టవల్ కాస్త అందిస్తే మీ చెల్లెలేం అరిగిపోదులే''

''అక్కా.. బావకి గుత్తొంకాయ కూర నేను చేస్తే ఇష్టం.. చెయ్యనా?'' ప్రియ మాధవి నడిగినా జవాబు రాజు ఇచ్చాడు.

''చెయ్యి ప్రియా... నీ చేతి గుత్తొంకాయ కూర అదిరిపోతుంది. అసలు ప్రియా.. మీ అక్కని కలిసేముందు నిన్ను చూసి ఉంటే నిన్నే పెళ్ళాడేసి ఉండేవాడిని..''

రాజు మాటలకి అదో పెద్ద జోకయినట్టు ప్రియ పకా పకా నవ్వింది.

మాధవి వినోద్‌కీ, సుజాత వాళ్ళకీ ప్రియని చూపించింది. కానీ రెండు సంబంధాలు వెనక్కిపోయాయి. వినోద్ వాళ్ళు జాతకం కుదరలేదు అంటే, సుజాత ఇంట్లో ప్రియ అందరికీ నచ్చినా... కట్నం లేకపోయినా పెళ్ళి మాత్రం హైదరాబాద్‌లోనే ఘనంగా చేయాలన్నారు. ఘనంగా కాదు కనీసం సింపుల్‌గానైనా హైదరాబాద్‌లో పెళ్ళి చేసే స్థితిలో వాళ్ళు లేరు అనగానే వెనక్కితగ్గారు. ''సరే కొన్నాళ్ళు ఉండి వెళ్తుంది.. ఈ లోపున ఇంకేమైనా సంబంధాలు దొరుకుతాయేమో'' అని మాధవి అందరికీ చెప్పి పెట్టింది.

★ ★ ★

''వస్తాడు నా రాజు ఈరోజు.. రానే వస్తాడు రారాజు ఈ రోజు'' ప్రియ సన్నగా పాడుతూ వంటింట్లో రాత్రి వంటకి కూరలు తరుగుతోంది. బయట హాల్లో కూర్చుని కాఫీ తాగుతున్న మాధవికి కాఫీ చేదుగా అనిపించింది. 'ఛీ... అదేం పాట.. ప్రియ చిన్నపిల్ల కాదు.. ఇలా ద్వంద్వార్థాలు ఉన్న పాటలు పాడడం ఏమిటీ... అదీ రాజుకి వినిపించేటట్టు...' రాను రానూ ప్రియ, రాజుల మధ్య చనువు మాధవిలో చిరాకునీ, భయాన్నీ కల్గిస్తున్నాయి. అందులో ముఖ్యంగా ప్రియ తనని అడగకుండానే ఓరోజు తన మొదటి వెడ్డింగ్ యానివర్సరీ చీర కట్టుకోవడం.. పొరపాటున అంటూ రాజు ప్రియని వాటేసుకోవడం మాధవి పరిస్థితి అడకత్తెరలో పోకలా ఉంది.

''ఏమండీ.. ప్రియని పంపించేస్తాను. ఇంక ఇక్కడ ఉండి చేసేదేముంది. అక్కడ పిన్నికి సాయంగానైనా ఉంటుంది'' మాధవి ఓరోజు సాయంత్రం రాజశేఖ

## తెలుగంటే ఇష్టం

'తెలుగువారందరం తెలుగే మాట్లాడదాం' అని మనం ఎంతగా మొత్తుకున్నా మనవాళ్లకి చెవికెక్కదు. బాలీవుడ్‌లో పరభాషా నటులు తమ సత్తాని నిరూపించుకుంటున్న తరుణమిది. ఇప్పుడు సోనూసూద్ కూడా అలాగే అంటున్నాడు. 'తెలుగు పరిశ్రమలో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని ఉంది' అంటున్నాడు. ఇంతకుముందు తెలుగులో అమ్మాయిలు అబ్బాయిలు చిత్రంలో నటించిన సోనూ తాజాగా నాగార్జున కొత్త చిత్రం 'సూపర్'లో కూడా నటించాడు. ఇటు తెలుగుతో పాటు అటు తమిళ చిత్రాల ఆఫర్లతో సోనూ చాలా బిజీగా ఉన్నాడు.

ర్‌తో అంది.

''ఇక్కడ నీకూ సాయంగా ఉందిగా..అయినా వచ్చిన పని అవందే..ఆ రెండు సంబంధాలు అవలేదు. కానీ కొత్తవి ఏవైనా దొరుకుతాయి. ఆ పల్లెటూళ్ళో ఏం చేస్తుంది. కంప్యూటర్ క్లాసులకి పంపిద్దాం. ఏదైనా చిన్న జాబ్ సంపాదించుకుంటే కట్నం లేకపోయినా ఎవరో ఒకరు ముందుకు వస్తారు పెళ్ళి చేసుకోవడానికి... నాలాగా..'' రాజు ముక్తాయింపుగా అన్నాడు.

''అవునక్కా...నాకు కంప్యూటర్స్ నేర్చుకోవాలని ఉంది'' ప్రియ ఆశగా చూసింది మాధవివైపు.

ప్రియని కంప్యూటర్ క్లాసులో చేర్పించింది మాధవి. ఇంకో నెల్లాళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ప్రియ వచ్చినప్పటినుంచీ తనకీ, రాజుకీ మధ్య దూరం ఏర్పడిందన్నది స్పష్టంగా తెలుస్తోంది మాధవికి. పిన్నికి సహాయం చెయ్యాలన్న తపనతో తన సంసారంలో స్పర్థలు రేపుకుంటోందా అన్న అనుమానం ఓ మూల. ప్రియనీ, రాజును హద్దుల్లో ఉండమని చెప్పలేని అశక్తత. అనవసరంగా గొడవలు అవుతాయన్న భయం..తనూ...రాజూ ఒకే ఆఫీసులో పనిచెయ్యడం అదృష్టం. ఓ రకంగా...ఇద్దరూ కలిసే వెళ్తారు, కలిసే వస్తారు. అందుకని ప్రియ, రాజు ఒంటరిగా గడిపే అవకాశం లేదు. మాధవికి అదొక్కటే ఊరడింపుగా ఉంది. ఒంట్లో బావుండక కొన్నాళ్ళు కొడుకు దగ్గర ఉందామని వర్ధనమ్మ రావడం మహదానందంగా అనిపించింది మాధవికి. అత్తగార్లవల్ల లాభం కూడా ఉంటుంది అని మురిసిపోయింది. 'తన సమస్యకి అత్తగారు ఇంట్లో ఉండడం జవాబు' అని మాధవి హాయిగా ఊపిరి పీల్చుకుంది. అనుకున్నట్టే రాజు, ప్రియ ముభావంగానే మెలగుతున్నారు. ఇంట్లో ఎక్కువసేపు ఉంటుంది కాబట్టే వర్ధనమ్మ తన పనులన్నీ ప్రియ చేత సావకాశంగా చేయించుకోవడం మొదలుపెట్టింది. వర్ధనమ్మ వచ్చాక ప్రియకి అక్కడ ఉండడం నచ్చకపోయినా..కంప్యూటర్ క్లాసులో చేరి వెంటనే వెళ్ళిపోతాననడం బావుందని ఉండిపోయింది.

★ ★ ★

''మధూ...'' కూరలు కొనడానికి ఆఫీసు నుంచి బజార్‌కి నడుచుకుంటూ వెళ్తున్న మాధవి ఉలిక్కిపడింది. ఆ గొంతు ''మధూ..'' అలా దీర్ఘంతీస్తూ పిలిచేది ఈ ప్రపంచంలో ఒక్కరే...విశాల్..సంభ్రమంగా వెనక్కి తిరిగి చూసింది మాధవి.

నిజంగానే ఎదురుగా విశాల్.

''విశాల్ నువ్వు..ఇక్కడ హైద్రాబాద్‌లో... ఎలా.. ఎప్పుడు వచ్చావు?'' మాధవి తడబడిపోతూ అంది.

''ఏం హైద్రాబాద్ నీ సొత్తా..ఇక్కడికి నేను రాకూడదా..'' విశాల్ ఎప్పటిలాగే అల్లరిగా అడిగాడు. విశాల్, మాధవీ చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నారు. ఎప్పుడూ మాధవిని ఉడికిస్తూ, కయ్యానికి సిద్ధంగా ఉండేవాడు విశాల్. ఆ తర్వాత విశాల్ వాళ్ళు ఊరొదిలి పొలాలు అమ్ముకుని విజయవాడ వెళ్ళిపోయారు. మాధవి విజయవాడలో కాలేజీలో చేరినప్పుడు మళ్ళీ విశాల్ క్లాస్‌మేట్.

''ఏం చేస్తున్నావు..ఏం జాబ్..ఎక్కడ..''

''అన్ని ప్రశ్నలు ఒక్కసారేనా..వన్ బై వన్..'' విశాల్ అన్నింటికీ సమాధానాలు ఇస్తున్నాడు. ''అమ్మా వాళ్ళందరూ బావున్నారా'' విశాల్ తండ్రి పోవటంవల్లే వాళ్ళు ఊరు వదిలి విజయవాడ మేనమామ ఇంటికి వెళ్ళిపోయారు. ఇంటికి పెద్దకొడుకు విశాల్..విశాల్‌కి ఇద్దరు చెల్లెళ్ళు..ఇద్దరు తమ్ముళ్ళు. అందరి బాధ్యతా విశాల్‌దే.

''చెల్లెళ్ళ పెళ్ళిళ్ళయ్యాయి. సుధాకర్ బి.కామ్ పాసయి మొన్ననే జాబ్‌లో చేరాడు..దినకర్ ఇంటర్..''

''అయితే నువ్విప్పుడు పెళ్ళికొడుకువన్న మాట..'' మాధవి నవ్వింది.

''ఏం అమ్మాయిని కన్నావా?'' విశాల్ అల్లరిగా చూశాడు.

''ఛీ..పో..నీకెప్పుడూ వేళాకోళమే'' చటుక్కున మాధవికి ప్రియ గుర్తుకొచ్చింది. విశాల్ తెలిసినవాడు. గవర్నమెంట్ ఉద్యోగం. ఇంకేం కావాలి. విశాల్‌ని డైరెక్ట్‌గా అడిగేసింది.

''మధూ..నాకు కట్నం అక్కరలేదు. మంచి అమ్మాయి అయితే చాలు. మాది పెద్ద ఫ్యామిలీ తెలుసుగా. అమ్మనీ, నా చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ తనవాళ్ళుగా భావించి వచ్చే పిల్ల కావాలని అనుకుంటున్నాను. అయితే ఒక చిన్న రిక్వెస్ట్. ఆ అమ్మాయికి పెళ్ళిచూపులని చెప్పొద్దు. ఎలాగూ ఆదివారం మీ ఇంటికి భోజనానికి రమ్మంటున్నావు కాబట్టి ఆరోజంతా మీతో ఉంటాను. కాబట్టి కాస్త ఆ అమ్మాయిని స్టడీ చేసే అవకాశం వస్తుంది''

''నో ప్రాబ్లెం'' మాధవికీ అదే బావుంటుందనిపించింది.

మాధవి ఇంటికి రాగానే విశాల్ గురించీ, భోజనానికి రమ్మన్న సంగతీ చెప్పింది. కానీ ప్రియకి అవి పెళ్ళిచూపులన్నది మాత్రం చెప్పలేదు. ఆ రాత్రి అనుకోకుండా రాజేశ్వరి ఫోన్ చేసింది.

''పిన్నీ.. త్వరలో నీకో శుభవార్త..'' మాధవి అనకుండా ఉండలేకపోయింది. మాధవికి చాలా నమ్మకంగా ఉంది విశాల్‌కి ప్రియ తప్పక నచ్చుతుందని. విశాల్‌కి అందమైన అమ్మాయి ఇల్లు చక్కదిద్దుకునే అమ్మాయి కావాలి. ప్రియ ఇంటి పనులు చక్కగా చేస్తుంది. ప్రియ విశాల్ కోరుకున్నట్లుగానే ఉంది.

★ ★ ★

ఆదివారం.

విశాల్ భోజనానికి వచ్చాడు. రాత్రి దాకా ఉండి వెళ్ళాడు. ప్రియని చూడగానే విశాల్ కళ్ళల్లో కన్పించిన మెరుపుచూశాక ప్రియకి ఈ సంబంధం కుదిరిపోయిందనే అన్పించింది. లాంఛనంగా వాళ్ళమ్మ, చెల్లెళ్ళతో ప్రియని చూడ్డానికి వస్తామని విశాల్ ఫోన్ చేస్తాడని ఎదురుచూస్తున్న మాధవికి విశాల్ నుంచి వచ్చిన ఉత్తరం అఘాతంలా తగిలింది.

''మధూ...ఈ ఉత్తరం నీకు నిరాశ కల్గిస్తుందని తెలుసు కానీ తప్పదు. సారీ... ప్రియకి నేను కోరుకున్న దానికన్నా ఎక్కువ అందం ఉంది. కానీ గుణం మాత్రం నేనాశించినట్టులేదు. ఎవరి అదృష్టమో ఎవరి దురదృష్టమో..మామూలు పెళ్ళిచూపుల్లోలా ప్రియని నేను చూసి ఉంటే ఈ పెళ్ళికి తప్పక ఒప్పుకునేవాడినే. కానీ ఆరోజు సాయంత్రం మనం గుడికి బయలుదేరుతున్నప్పుడు నువ్వు నీ చీర ఐరన్ చెయ్యమన్నావు ప్రియని గుర్తుందా? ఆ చీర పొరపాటున కాలిపోలేదు. ప్రియ కావాలనే దానిమీద ఐరన్ ఉంచి బయటికి వచ్చింది. అది నీ పెళ్ళి చీరల్లో ఒకటి అని ఎంతో బాధపడ్డావు నువ్వు. మీ అత్తగారు కళ్ళు సమంగా కనపడక తడుముకుంటూ పెరట్లోకి వెళ్తోంటే ఆవిడ దారికడ్డంగా చెక్క పీటని తోసింది. మరో విషయం నిజం అవునో కాదో..నువ్వు గమనించావో లేదో..కానీ ప్రియ రాజశేఖర్ మధ్య చనువు కాస్త మోతాదు మించి ఉంది అనిపించింది..'' ఉత్తరం చదువుతున్న మాధవి మొహం ఎర్రగా కందిపోయింది. మిగతా ఉత్తరం చదవాల్సిన పనిలేదు అన్నట్టు మడిచి పెట్టేసింది.

వర్ధనమ్మ ఇంట్లో ఉండడంతో రాజు, ప్రియ ఈమధ్య చనువుగా ఉండటం లేదు. కానీ ఆరోజు బయటికి వెళ్ళినప్పుడు గుడి దగ్గరా, హోటల్‌లోనూ ప్రియ రాజుతో అతి చనువుగానే ఉంది. ప్రియని అనుకుని ఏం లాభం...రాజువైపు నుంచీ ప్రోత్సాహం లభిస్తూంటే. మాధవి నిట్టూర్చింది.

'సహాయం చెయ్యడానికి అర్హత ఉండాలి. అలాగే సహాయం అందుకోవడానికీ ఓ అర్హత ఉండాలి. ఆ అర్హత ప్రియకి లేదు. పిన్ని కూతురు అన్న అభిమానంతో తను మంచి చెయ్యాలనుకుంది. ప్రియకి ప్రాప్తం లేదు.'

ప్రియ కంప్యూటర్ కోర్స్ అయిపోయింది. విశాల్ జవాబు చూసుకుని ప్రియని ఊరికి పంపించాలనుకుంది మాధవి. అదీ తేలిపోయింది. మర్నాడు ట్రైన్‌కి టికెట్ బుక్ చేయించింది ప్రియకి. రాజు మనసులో ఏం ఉన్నా పైకి అభ్యంతరం చెప్పలేదు టికెట్ బుక్ చేయిస్తున్నానంటే.

ఆ రాత్రి అనుకోకుండా మాధవి పిన్ని మళ్ళీ ఫోన్ చేసింది.

''మాధవీ..ఏదో శుభవార్త చెప్తానన్నావు. ఏమిటీ..'' కుతూహలంగా అడిగింది రాజేశ్వరి. మాధవికి ఏం చెప్పాలో తోచలేదు ఓ క్షణం.

''శుభవార్త..రేపు మధ్యాహ్నం ట్రైన్‌లో ప్రియని ఊరికి పంపిస్తున్నాను పిన్నీ''

'అది శుభవార్తా...' మాధవి పిన్ని అయోమయంగా అనుకుంది మనసులో. ☆